


# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

### నాకు జ్ఞాపకం లేని "ఆ అరవై రోజులు"

2012 ఆగస్టు 31 వ తేదీ రాత్రి ఏడు గంటలవుతూండగా నేను ఒక సమావేశంలో పాల్గొనటానికి ప్రెస్ క్లబ్బుకి వెళ్ళాను. ఇంకా సమావేశం ప్రారంభం కాలేదు హఠాత్తుగా నా మెడ రెండు వైపులా నొప్పి ప్రారంభమైంది. కొద్ది నిమిషాలకే ఆ నొప్పి రెండు కణతలకు ప్రాకింది. నాకు'స్పాండిలైటిస్'వున్న కారణంగా ఆ నొప్పి వచ్చివుంటుదనుకున్నాను. క్షణాల్లో నొప్పి విపరీతమై కళ్ళు తిరిగాయి. సమావేశం నించి ఇంటికి వెళ్ళిపోతే మంచిదనుకున్నాను. కుర్చీలోంచి లేవబోయాను.

నాకేమీ కనిపించలేదు. స్పృహ కోల్పోతున్నట్లు అనిపించింది. అంతే అలా కుర్చీలోనే కూలిపోయాను తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు. తిరిగి సెప్టెంబరు 20 వ తేదీన నా కుటుంబ సభ్యులతో కేర్ ఆస్పత్రినించి ఇంటికి చేరటం మాత్రమే జ్ఞాపకం వుంది. ఆ మధ్యలో ఇరవై రోజులూ ఏం జరిగిందో నాకు జ్ఞాపకంలేదు.

నా భార్యా, నా పిల్లలూ ఆ ఇరవై రోజులూ ఏం జరిగిందో రాస్తామంటే రాయమన్నాను. వాళ్ళు రాసిన ఆ ఇరవై రోజుల వాళ్ళ జ్ఞాపకాల్నీ యధాతధంగా మీకు తెలియపరుస్తున్నాను. చదవండి ...

### తలనీలాలూ, నిలువుదోపిడీ సమర్పించుకున్నాను

-జె. రాజ్యలక్ష్మి (నా శ్రీమతి)

ఆగస్టు 31 వ తేదీ 2012 వ సంవత్సరం. ఆరోజు పొద్దున్నే పదిగంటలకు దూరదర్శన్ సిబ్బంది మా ఇంటికి వచ్చి మా వారి ఇంటర్వ్యూని షూటింగ్ చేశారు. ఆ రోజుకి ఆయన కేటరాక్ట్ ఆపరేషన్ చేయించుకుని పదిరోజులైంది.

ఆ సాయంత్రం ప్రెస్ క్లబ్బులో ఏదో సమావేశం వుందని వెళ్ళారు. రాత్రి ఏడున్నర ప్రాంతంలో శ్రీధర్ కి ఏదో ఫోన్ వచ్చింది. వెంటనే నా మనుమడు తేజాని తీసుకుని బండిమీద బయటికి వెళ్ళిపోయాడు శ్రీధర్! నా కోడలు రామలక్ష్మి ఎందుకో కంగారుపడుతున్నట్టుగా కనిపించింది.

ఓ గంట గడిచాక తనకు ఫోన్ వచ్చింది. అప్పుడు చెప్పింది రామలక్ష్మి–"మావయ్యగారు కళ్ళు తిరిగి పడిపోయారట! కేర్ ఆస్పత్రికి తీసుకువెళ్ళారట. మనం కూడా వెడదాం రండి!" అని.

పొద్దున్న చాలా సేపు షూటింగ్ వల్ల అలసిపోయి వుండటం, అంతకు పదిరోజుల ముందు కంటికి ఆపరేషన్ జరగటం– అసలే ఆయనకి స్పాండిలైటిస్ వుండటం– వీటి కారణాలవల్ల కళ్ళు తిరిగి వుంటాయిలే–అనుకున్నాను.

నేసూ నాకోడలూ కేర్ ఆస్పత్రికి చేరుకున్నాం. అప్పటికి అక్కడ నా పెద్దబ్బాయి సారధీ, వాని మిత్రులూ వున్నారు. ఆయన్ని ఏవో టెస్టు చేయటానికి తీసుకెళ్ళినట్టు తెలిసింది! నాకు అప్పుడు భయమూ బాధా, మొదలయ్యాయి.

తెల్లారిం తర్వాత–ఆయనకు యాంజియోగ్రామ్ చేస్తారనీ, అంతవరకూ అబ్జర్వేషన్ లో వుండాలనీ, డాక్టర్లు నాతో చెప్పారు. నాకు అయోమయంగా వుంది. వెంకటేశ్వరస్వామికి తలనీలాలూ, నిలువుదోపిడీ ఇస్తానని మొక్కుకున్నాను.

ఆపరేషన్ జరిగింది .. ఫెయిలయినట్టు తెలిసింది. మర్నాడు డా॥ శివారెడ్డి గారు వచ్చి మరో ఆపరేషన్ చేస్తారని చెప్పారు. గుండె రాయి చేసుకున్నాను. శివారెడ్డిగారు వచ్చి ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత ఐ.సి.యు.లో రెండ్రోజులు పూర్తిగా మత్తులోనే వున్నారు.

నాలుగోరోజు అమెరికా నుంచి మా చిన్నబ్బాయి వేణు వచ్చాడు.

మూడురోజులు గడిచాక ఆయన స్పృహలోకి వచ్చాక డా॥ సుబ్రహ్మణ్యంగారు మావారికి నన్ను చూపించి "ఆవిడకి మీరేమవుతారూ?" అని అడిగారు.

“హస్బెండ్ నవుతాను” అని నెమ్మదిగా చెప్పారాయన.

ఆయన మళ్లీ మామూలవటం చూసి, 'నేనూ, మా పిల్లలూ చేసుకున్న అదృష్టం' అనుకున్నాను. ఆ క్షణంనుంచీ దేవుడి మీద నమ్మకం ఎక్కువైంది. డాక్టర్ల మీద కూడా అంతే సమ్మకం పెరిగింది.

మొత్తంమీద ఆ ఇరవై రోజులూ ఓ పీడకలలా గడిచిపోయాయి. తర్వాత చాలా యాత్రలు చేసి దైవ దర్శనాలు చేసుకున్నాం. మా విజయనగరకాలనీ వినాయకుడిని ప్రతిరోజూ తలుచుకుంటూ, దర్శిస్తూ 'గం గణపతయేనమః హం

హనుమంతే నమః' అనే మంత్రాన్ని జపం చేసుకుంటూ రోజులు గడుపుతున్నాను. మా కుటుంబసభ్యులూ బంధుమిత్రులు అందరూ క్షేమంగా వుండాలని కోరుకుంటున్నాను.

"ఎమర్జెన్సీలో వున్న నాన్నని చూసేందుకు వెళ్లాను"

-జె. విజయసారథి (పెద్ద కుమారుడు)

ఆగస్టు 31, 2012 ..!

సుమారు ఎనిమిది గంటల సమయంలో నా తమ్ముడు శ్రీధర్ నాకు ఫోన్ చేసి "నాన్న కేర్ హాస్పిటల్ లో వున్నారు. బంజారాహిల్స్ కేర్ లో!"-అని చెప్పాడు.

వెంటనే నా స్నేహితులతో బయల్దేరి వెళ్లాను. ఆస్పత్రి వరండాలో శ్రీధర్, అమ్మ, నా మరదలు రామలక్ష్మి వున్నారు. లోపల నాన్నకి ఏవో టెస్టులు జరుగుతున్నాయని చెప్పారు .. కొంచెం ఖంగారు పడ్డాను-'వయసు రీత్యా హార్టులో ఏమైనా" Clot 'కానీ, ' బ్లాక్ గానీ 'వుండచ్చునేమో-స్టంట్' లాంటిది ఏమైనా వేస్తారేమో '-అనుకున్నాను.

ఎమర్జెన్సీలో వున్న నాన్నని చూసేందుకు వెళ్లాను." మీరంతా ఎందుకొచ్చారూ? " అని మామూలుగానే ఆడిగారు. నాకు కంగారు కొంచెం తగ్గింది. కొంత సేపటికి బ్రెయిన్ కి ఎమ్.ఆర్.ఐ., సి.టి. స్కాన్ లాంటి టెస్టులు చేసి-" హార్టుకి సంబంధించిన ఇష్యూ ఏం కాదు. బ్రెయిన్ లో నరం చిట్లింది. బ్రెయిన్ హెమరేజ్ లాగా వచ్చింది. బ్రెయిన్ సర్జరీ అవసరం అవుతుంది . కోయలింగ్ చేస్తాం "అని చెప్పారు డాక్టర్లు!

మర్నాడు ఆపరేషన్ థియేటర్ కి తీసుకెళ్లారు. దాదాపు ఆరుగంటల తర్వాత డాక్టర్లు థియేటర్ లోంచి బయటకు వచ్చారు. నాన్న ఏజ్ కాబట్టి, స్పాండిలైటిస్ కూడా వుండటం వల్ల కోయిల్ మెడ వంపుల్లోంచి బ్రెయిన్‌లోకి చేర్చటం కష్టమైందని చెప్పారు. ఈ పద్ధతి విజయవంతం కాలేదు కాబట్టి ఇంక ఓపెన్ బ్రెయిన్ సర్జరీ' తప్ప మార్గం లేదన్నారు.

మేమంతా ఆందోళనకు గురయ్యాం ... అప్పటివరకూ అనస్థీషియాలోనే ఉన్న నాన్న తిరిగి స్పృహలోకి వస్తే మళ్లీ బ్రెయిన్ సర్జరీకి ముందు ఆనస్థీషియా ఇచ్చే బదులు-అలాగే పేషెంట్ ని అనస్థీషియాలోనే కంటిన్యూ చేసి-ఆ మర్నాడు సర్జరీ చేస్తామన్నారు. దానివల్ల కొన్ని ప్రమాదకరమైన పరిణామాలకి మేం సిద్ధంగా వుండాలని కూడా చెప్పారు.

జ్ఞాపకశక్తి కోల్పోయే అవకాశం, ఇన్ ఫెక్షన్ వల్ల ఏర్పడే మరేదైనా ప్రమాదం ఉండవచ్చునన్నారు!

నేనూ, నా తమ్ముడు, మా కుటుంబ సభ్యులు చాలా టెన్షన్ పడ్డాం. కానీ ఉన్నది అదొక్కటే ఆప్షన్ కనక-ప్రొసీడ్ అవమన్నాం? అమ్మకి మాత్రం ఈ సర్జరీలో వున్న ప్రమాదాల గురించి చెప్పలేదు ...

ఇక్కడ మా అమ్మ గురించి చెప్పాలి! మనిషికి దైవబలం మీద వున్న అచంచల విశ్వాసానికి-మా అమ్మ పెద్ద ఉదాహరణ. నాన్న ఆస్పత్రిలో వున్నన్ని రోజులూ అసలు భయపడలేదు సరికదా-'మేం అమ్మకి ధైర్యం చెప్పాలి!-అనే అవకాశం కూడా తను మాకు ఇవ్వలేదు. ఆ తిరుపతి వెంకటేశ్వరుని మీద భారంవేసి, నాన్న మామూలు మనిషిగా, పూర్తిగా ఆరోగ్యంతో ఇంటికి తిరిగొస్తే తన తలనీలాలూ, నిలువుదోపిడీ సమర్పించుకుంటానని మొక్కుకుంది. అంతోకొంతో దైవశక్తి మీద నమ్మకం వున్న నాకు అంతకంటే మా అమ్మకి వున్న నమ్మకం పైన ఇంకా ఎక్కువ నమ్మకం వున్న నాకు-అన్నీ సవ్యంగానే జరిగి నాన్న బయటపడతారని నమ్మకం వున్నప్పటికీ-జరగబోయే సర్జరీలో ప్రమాదం మాత్రం నన్ను కొంచెం హెచ్చరిస్తూనే వుంది.

“నాన్న ప్రమాదం నించి బయటపడితే చాలు "-అని అనుకోని క్షణం లేదు.

అంతకు ముందు రోజు రాత్రే నా తమ్ముడు వేణు కూడా అమెరికా నించి వచ్చి నిద్రాహారాలు లేకుండా మా వెంటే వున్నాడు. నిజానికి-ఆ ఇరవై రోజులూ కాలానుక్రమంగా జరిగిన సంఘటనలు శ్రీధర్ కి గుర్తున్నట్లు నాకు గుర్తు లేకపోవటం ఒక విధంగా అదృష్టమే అనుకున్నాను. గుర్తుండి వుంటే-నేనేమయిపోయే వాడినో అనిపించింది! నామటుకు నేను నాన్న మునపటి మనిషిలా కుదుటపడి పూర్తిగా కోలుకుని, తనలోని రచయిత కూడా మేలుకొని మళ్లీ ఎప్పుడు కథలు రాస్తాడో అని ఎదురు చూశా.

తిరుమల శ్రీనివాసుడికి తలనీలాలుఇచ్చుకుంటానని నేనూ మొక్కుకున్నాను .. అంతే! ఆ భగవంతుడు ఒకటి కాదు నాన్న చేత ఎన్నో కథలు రాయించాడు. మొదటి కథ ఆపరేషన్ అయిన ఆర్నెల్లకే కాబోలు రాశాడు. నేను తిరుపతి వెళ్లి మొక్కు తీర్చుకున్నాను.

ఇప్పుడు నాకెంతో ఆనందంగా వుంది! హాస్పిటల్ లో వున్న ఆ ఇరవై రోజులూ తప్ప-తన జ్ఞాపకశక్తిని కొంచెం కూడా కోల్పోకుండా-ఇప్పుడు' నేను-నా జ్ఞాపకాలు ' శీర్షికతో-ఆత్మకథ రాసుకోవటం నిజంగా ఆ శివుని కృపే!

మా అమ్మ పూజలూ, నాన్న ఆరోగ్యకరమైన జీవనశైలీ అంతకుమించి మా కుటుంబ సభ్యుల ప్రార్థనలూ-ఇవన్నీ కలసి నాన్నకి పునర్జన్మను ప్రసాదించాయి. ఈ రోజు తన 80 వ జన్మదినాన్ని ఆరోగ్యవంతంగా, ఆనందంగా జరుపుకుంటూ ఈ ఆత్మకథ పుస్తకాన్ని-మా నాన్నకి సర్జరీ చేసిన డా ॥ శివారెడ్డి గారికి అంకితం ఇవ్వటం నాకెంతో

సంతోషంగా, సముచితంగా వుందని భావిస్తున్నాను.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments